16.07.2020

అమరావతి

వైద్యం ఖర్చు వేయి రూపాయలు దాటితే వైయస్సార్ ఆరోగ్యశ్రీ వర్తింపు పథకాన్ని ఆరుజిల్లాలకు విస్తరణ

మొత్తం 2200 రకాల వైద్య ప్రక్రియలు

క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించిన సీఎం శ్రీ వైయస్.జగన్

# వైద్యం అందక ఏ ఒక్కరూ చనిపోకూడదు, ఆ దిశలోనే పలు చర్యలు

- కుటుంబంలో ప్రతి ఒక్కరూ చల్లగా ఉండాలని అడుగులు వేశాం
- వైద్యం ఖర్చు వేయి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు
- మరో ఆరు జిల్లాలకు పథకం విస్తరణ
- క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించిన సీఎం
- ఆరోగ్యశ్రీ పథకంలో ఇది మరో మైలురాయి
- ఈ పథకంలో ఇవాళ మరో అడుగు ముందుకు వేశాం
- ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ వెల్లడి
- ఆరోగ్యశ్రీ పరిధిని విస్తృతంగా పెంచుతూ పోతున్నాం
- గతంలో ఈ పథకంలో కేవలం 1059 వైద్య ప్రక్రియలు మాత్రమే అందేవి
- అవి కూడా అరకొరే
- గత ప్రభుత్వంలోనెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు రూ.680 కోట్లు బకాయిలు పెట్టారు
- అధికారంలోకి రాగానే ఆ బకాయిలన్నీ తీర్చాం
- ఆయా ఆస్పత్రుల ద్వారా మెరుగైన సేవలందేలా చర్యలు చేపట్టాం
- పేదలు గర్వంగా తలెత్తుకుని చికిత్స చేయించుకుని, డిశ్చార్జ్ అయ్యేలా చర్యలు తీసుకున్నాం
- ఆ మేరకు అన్ని బిల్లులను గ్రీన్ ఛానల్‌లో పెట్టి చెల్లిస్తున్నాం: సీఎం

- కోవిడ్ నివారణ చర్యలపై కలెక్టర్లు మరింత దృష్టి పెట్టాలి
- కోవిడ్ పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి: సీఎం

**అమరావతి :** వైద్యం ఖర్చు వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడంతో పాటు, కొత్తగా ఆరు జిల్లాలకు పథకాన్ని విస్తరించారు. ఆరోగ్యశ్రీలో మొత్తం 2200 రకాల వైద్య ప్రక్రియలను అందజేస్తూ విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు, ప్రకాశం, వైయస్సార్ కడప, కర్నూలు జిల్లాలకు పథకాన్ని విస్తరించారు. క్యాంప్ కార్యాలయంలో సీఎం శ్రీ వైయస్ జగన్ గురువారం దీన్ని ప్రారంభించారు.

సీఎస్ నీలం సాహ్ని, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ మల్లికార్జున్‌తో పాటు, పలువురు అధికారులు, లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పథకాన్ని ఆరు జిల్లాలకు విస్తరించిన అనంతరం సీఎం శ్రీ వైయస్ జగన్, ఆయా జిల్లాలలోని అధికారులు, పథకం లబ్ధిదారులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు.

### అందరికీ వైద్యం అందాలి:

వైద్యం అందక ఏ ఒక్కరూ చనిపోకూడదని, ఆ దిశలోనే పలు చర్యలు తీసుకుంటున్నామని సీఎం శ్రీ వైయస్ జగన్ వెల్లడించారు. కుటుంబంలో ప్రతి ఒక్కరూ చల్లగా ఉండాలని అడుగులు వేశామన్న ఆయన, ఆరోగ్యశ్రీ పథకంలో ఇవాళ మరో అడుగు ముందుకు వేశామని తెలిపారు. ఇంకా ఆరోగ్యశ్రీ పరిధిని విస్తృతంగా పెంచుతూ పోతున్నామని చెప్పారు.

### గత ప్రభుత్వ హయాంలో!:

గత ప్రభుత్వ హయాంలో ఈ పథకంలో కేవలం 1059 వైద్య ప్రక్రియలు మాత్రమే అందేవని, అవి కూడా అరకొరగానే ఉండేవని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు రూ.680 కోట్లు బకాయిలు పెట్టగా, తాము అధికారంలోకి రాగానే ఆ బకాయిలన్నీ తీర్చామని, ఇంకా ఆయా ఆస్పత్రుల ద్వారా మెరుగైన సేవలందేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. పేదలు గర్వంగా తలెత్తుకుని చికిత్స చేయించుకుని, డిశ్చార్జ్ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్న ఆయన, ఆ పేదవాడిని డాక్టర్లు కాని, ఆ ఆసుపత్రులు కాని చిన్నచూపు చూడకూడదన్న ఉద్దేశ్యంతో ఆరోగ్యశ్రీకి సంబంధించిన పేమెంట్స్ అన్నీ గ్రీన్ ఛానల్‌లో పెట్టి చెల్లిస్తున్నామని చెప్పారు.

### పథకం—వైద్య ప్రక్రియలు:

ఆరోగ్యశ్రీ పథకంలో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1259 వైద్య ప్రక్రియలు అందుతుండగా, పశ్చిమ గోదావరి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద మొత్తం 2200 వైద్య ప్రక్రియల సేవలందుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు.

**మరో మైలురాయి:**

ఇవాళ దాన్ని మరో ఆరు జిల్లాలకు విస్తరిస్తున్నామన్న సీఎం, ఆరోగ్యశ్రీ పథకంలో ఇది మరో మైలురాయి అని అభివర్ణించారు. అంతే కాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా ఏప్రిల్ 6న కరోనాను కూడా ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చామని, వారం క్రితం నాన్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లోనూ కరోనాకు చికిత్స చేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

ఇంకా దేశంలో తొలిసారిగా అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఒకేసారి 1088 అంబులెన్సులు ప్రవేశపెట్టామని, తద్వారా రాష్ట్రంలోని ప్రతి మండలంలో అత్యంత మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**చికిత్స తర్వాత కూడా!:**

కుటుంబంలో ప్రతి ఒక్కరూ చల్లగా ఉండాలని అడుగులు వేశామన్న ముఖ్యమంత్రి ఆస్పత్రులలో రోగులు చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన తర్వాత వైద్యులు సూచించినంత కాలం వారికి రోజుకు రూ.225 లేదా నెలకు గరిష్టంగా రూ.5 వేలు 'వైయస్సార్ ఆసరా' పథకంలో ఆర్థిక సహాయం చేస్తున్నామని సీఎం తెలిపారు.

**అందరికీ పథకం:**

అందరి చల్లని దీవెనలతో చేయగలుగుతున్నామన్న ఆయన, వైద్యం అందక ఏ ఒక్కరూ కూడా చనిపోకూడదన్నది తమ అభిమతమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఆరోగ్యశ్రీ కార్డులు:**

అందుకే వార్షిక ఆదాయం రూ.5 లక్షల వరకు ఉన్న వారికి కూడా పథకం అమలు చేస్తున్నామని, ఇంకా తొలిసారిగా 1.42 కోట్ల ఆరోగ్యశ్రీ కార్డులు క్యూఆర్ కోడ్‌తో ఇస్తున్నామని, ఆ కార్డులో రోగికి సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయని చెప్పారు.

ఆ కార్డులలో ఇప్పటికే 1.38 కోట్ల కార్డుల పంపిణీ పూర్తి కాగా, మిగిలిన 4 లక్షల కార్డుల ముద్రణ కూడా పూర్తైందని,వీలైనంత త్వరగా వలంటీర్ల ద్వారా వాటిని అందజేస్తామని వెల్లడించారు.

**నాడు—నేడు**

ఆరోగ్యశ్రీలో మంచి వైద్యం అందిస్తూ, నాడు–నేడు కార్యక్రమంలో ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తున్నామని సీఎం శ్రీ వైయస్ జగన్ తెలిపారు.

ఇప్పటికే రాష్ట్రంలో 11 టీచింగ్ ఆస్పత్రులు ఉండగా, కొత్తగా 16 ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతో 27 టీచింగ్ ఆస్పత్రులు ఏర్పాటవుతాయని, దాదాపు రూ.16 వేల కోట్ల వ్యయంతో ఆస్పత్రుల రూపురేఖలు మార్చడంతో పాటు, కొత్త ఆస్పత్రులు, వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆస్పత్రులకు గ్రేడింగ్ ఇచ్చి, మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని పేర్కొన్నారు.

**మందులు–ప్రమాణాలు:**

ఇంకా అన్ని ఆస్పత్రులలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), జీఎంపీ ప్రమాణాలతో కూడిన మందులు ఇస్తున్నామని సీఎం శ్రీ వైయస్ జగన్ వెల్లడించారు. గతంలో కేవలం 230 రకాల మందులు మాత్రమే ఇస్తుండగా, జనవరి నుంచి 500 రకాల మందులు ఇస్తున్నామని తెలిపారు.

**విలేజ్ క్లినిక్స్:**

గ్రామ సచివాలయాల పక్కనే అన్ని గ్రామాలలో 13 వేల వైయస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి, వాటిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు రోజంతా అందుబాటులో ఉంటారని, ఎవరికి బాగా లేకపోయినా వైద్యం అందిస్తారని, ఆ క్లినిక్‌లు అవి రెఫరల్ ఆస్పత్రులుగా పని చేస్తాయని తెలిపారు. ఆ క్లినిక్స్‌లో 54 రకాల మందులు కూడా ఉంటాయని చెప్పారు.

**వైయస్సార్ కంటి వెలుగు:**

రాష్ట్రంలో దాదాపు 65 లక్షల పిల్లలకు వైయస్సార్ కంటి వెలుగు పథకంలో వైద్య పరీక్షలు చేశామని, వారిలో 1.58 లక్షల మందికి కళ్లజోళ్లు కావాలని తేలితే వాటిలో 1.29 లక్షల మంది పిల్లలకు కళ్లజోళ్లు ఇచ్చామని, మిగిలిన 29 వేల కళ్లజోళ్లు కూడా ఈ నెలాఖరు నాటికి ఇవ్వబోతున్నామని సీఎం వెల్లడించారు. 2621 మంది పిల్లలకు ఆపరేషన్లు కావాలని తేలిందన్న ఆయన, వారికి కూడా స్కూళ్లు తెరిచాక, సెలవులు వచ్చినప్పుడు ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు.

**వ్యాధిగ్రస్తులకు పెన్షన్లు:**

దీర్ఘకాలం వ్యాధులతో బాధ పడుతున్న వారికి పెన్షన్లు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. దీర్ఘకాల వ్యాధులతో బాధ పడుతున్న వారికి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు పెన్షన్లు కూడా ఇస్తున్నామన్న ఆయన, లెప్రసీ, తలసేమియా వంటి వ్యాధిగ్రస్తులకు, పక్షవాతంతో మంచానికే పరిమితమైన వారికి, వీల్ ఛైర్లకు పరిమితమైన వారికి రూ.10 వేల వరకు పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు.

**కలెక్టర్లకు నిర్దేశం:**

ఇప్పుడు విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు, ప్రకాశం, వైయస్సార్ కడప, కర్నూలు జిల్లాల కలెక్టర్లు పథకంపై ప్రత్యేక ధ్యాస పెట్టాలని, ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ఆరోగ్యశ్రీ పథకంలో 2200 వైద్య ప్రక్రియలు అందేలా చూడాలని సీఎం శ్రీ వైయస్ జగన్ నిర్దేశించారు.

**కోవిడ్‌పై అవగాహన:**

కోవిడ్‌కు సంబంధించి ఇంకా జాగ్రత్తగా ఉండాలన్న ముఖ్యమంత్రి, వాక్సిన్ వచ్చే వరకు కొన్ని నెలల పాటు, కోవిడ్‌తో కలిసి జీవించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. కాబట్టి దాని (కోవిడ్)తో కలిసి ఎలా బతకాలి అన్న దానిపై అందరికీ అవగాహన కల్పించాలని, ఆ దిశలో కలెక్టర్లు చొరవ చూపాలని కోరారు.

కోవిడ్ లక్షణాలు కనిపిస్తే ఎవరికి ఫోన్ చేయాలి? ఏం చేయాలి? ఎక్కడికి పోవాలి? అన్న వాటిపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచాలని సీఎం స్పష్టం చేశారు.

కోవిడ్ కేసుల్లో 85 శాతం కేసులు ఇంట్లోనే ఉండి వైద్యం పొందవచ్చని, మిగిలిన 15 శాతం కేసుల్లో కూడా కేవలం 4 శాతం కేసులకు మాత్రమే ఐసీయూలో చికిత్స అవసరం అవుతుందని చెప్పారు. కాబట్టి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ఇందుకోసం కలెక్టర్లు శ్రద్ధ చూపాలని కోరారు.

రాష్ట్రాల సరిహద్దులు తెరుస్తున్నారని, అంతర్జాతీయ విమానాల రాకపోకలు కొనసాగుతున్నాయని, ఈ నేపథ్యంలో కోవిడ్‌ను ఏ మాత్రం కట్టడి చేయలేమని అన్నారు.

**ప్రత్యేక డ్రైవ్:**

కోవిడ్ లక్షణాలు కనిపిస్తే.. ఏం చేయాలి? అన్న దానిపై ప్రజలందరికీ తెలిసే విధంగా కలెక్టర్లు ఒక ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీఎం నిర్దేశించారు. అలాగే తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు.. ముఖానికి మాస్కు, చేతికి గ్లౌజెస్, భౌతిక దూరం పాటించడం, శానిటైజేషన్, చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటివి ఇంకా బాగా ప్రచారం చేయాలని కోరారు.

ఆ తర్వాత వివిధ జిల్లాలలో ఉన్న ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులతో సీఎం వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు.